క్లుప్తంగా

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం


వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణంలో పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. సోమవారం మునగపాక బీసీ కాలనీకి చెందిన కుంది రి మురళి జ్ఞాపకార్థం తల్లితండ్రులు వెంకట సత్యనారాయణ, కనక మహలక్ష్మి దంపతు లు రూ.5,116 నగదును విరాళంగా అందజేశా రు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలగా శ్రీనివాసరావు, ఆడారి కాశీబాబు, పెంటకోట చిన్న, కేవీఎస్ అప్పారావు, వెలగా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం


విరాళం అందిస్తున్న నాగేశ్వరరావు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళ వరపుపేట గ్రామాల సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. దీనిలో భాగంగా మండలంలోని మూలపేటకు చెందిన భీశెట్టి సాంబమూర్తి జ్ఞాపకార్థం కుమారుడు నాగేశ్వరరావు రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వెబ్ తరగతులు


ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా వెబ్ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట: చినదొడ్డిగొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా విద్యా బోధన చేస్తున్నారు. విద్యా శక్తి కార్యక్రమంలో భాగంగా ఐఐటీ మద్రాసు ప్రొఫెసర్లతో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం గతేడాది ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 5 వేలు పాఠశాలల్లో అమలుకు చర్యలు చేపట్టినట్టు పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వెంకటరమణ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా ఆన్‌లైన్‌లో గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధన చేస్తున్నారు. కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసం, యోగాపై కూడా తరగతులు నిర్వహిస్తున్నట్టు వెంకటరమణ తెలిపారు. సోమ, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ పాఠ్యాంశాలను మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్లు ఆన్‌లైన్‌లో విద్యార్థులకు ప్రత్యేక బోధన చేస్తున్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ సంఘం నేతలు

అనకాపల్లి టౌన్: జీవో నంబర్ 1217 రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్షణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ ఎం భాస్కర అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. లక్ష్మణ మాట్లాడుతూ 1996 చట్టం అమలు చేసి 12 రకాల సౌకర్యాలు అందించాలన్నారు. కార్మికులకు కొత్త గుర్తింపు కార్డులు ఇచ్చి, పాత కార్డులను రెన్యువల్ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘాలతో వెంటనే మీటింగ్ ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు.

పారిశుధ్య సిబ్బందిని కొనసాగించాలని డిమాండ్

అనకాపల్లి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని ఏపీ స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జానకి మాట్లాడుతూ 300 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో ఒక్క విద్యార్థి తక్కువ ఉన్నా రెండో శానిటేషన్ సిబ్బందిని తొలగిస్తున్నారని వాపోయారు. ఈ చర్య చాలా అన్యాయమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా 200 మంది విద్యార్థులు ఉన్న ప్రతీ పాఠశాలలో ఇద్దరు శానిటేషన్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సాగునీరు వృథా.. రైతుల వ్యధ.!


గ్రోయిన్ మరమ్మతుల కారణం వృథాగా పోతున్న నీరు

- వరాహ నదిలో పాడైన గ్రోయిన్లు
- వరద నీరు సముద్రం పాలు
- ప్రశ్నార్థకంగా ఖరీఫ్ సాగు


వరాహ నదిలో ప్రారంభమైన నీటి ప్రవాహం


తిమ్మాపురంలో నీరు లేక ఎండుతున్న నారు మడి

ఎస్.రాయవరం: వరాహ నదిలో గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీరు వృథాగా దిగువకు పోయి సముద్రంలో కలుస్తోంది. మండలంలో 80 శాతం సాగు వర్షాధారమే. దార్లపూడి నుంచి వాకపాడు శివారు బంగారమ్మపాలెం వరకు వరాహ నది ప్రవాహం మండలంలో పలు గ్రామాల మధ్య సాగుతోంది. ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితేనే ప్రవాహం ఉంటుంది. ఆ క్రమంలో నదిపై దార్లపూడి జమ్మికాలువ గ్రోయిన్, సోమిదేవపల్లి వద్ద మూలపాలెం గ్రోయిన్, పెనుగొల్లుధర్మవరం వద్ద పెదఉప్పలం, ఎస్.రాయవరం పాయలకు నీరు అందించే గ్రోయిన్, పెదఉప్పలం వద్ద పెదఉప్పలం గ్రోయిన్, వమ్మవరం వద్ద కొరుప్రోలు కాలువ గ్రోయిన్‌లు ఉన్నాయి. ఈ గ్రోయిన్లు కొన్నాళ్లుగా శిథిలమై మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. వరద నీరు వస్తే కాలువల్లో నీరు పోటెత్తి చెరువులు నిండుతాయి. అదే క్రమంలో గడిచిన ఐదేళ్ల పంటలు పండాయి. ఇప్పుడు ఈ ఏడాది అరకొర వర్షాలు కురవడంతో నదిలో ప్రవహించే కొద్దిపాటి నీరు మరమ్మతులకు గురైన గ్రోయిన్ల ద్వారా వృథా దిగువకు పోతోంది.

మండలంలో వరి 7 వేల ఎకరాలు, కొబ్బరి 7,500 ఎకరాలు, అరటి, తమలపాకు, కూరగాయలు, అయిల్‌పామ్, కోకో వంటి పంటలు సుమారుగా 6 వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. వీటన్నింటికీ వరాహ నది ద్వారా నిండిన చెరువు నీరే ఆధారం. వీటిలో 10 శాతం పంట పొలాలకు మాత్రమే వ్యవసాయ మోటార్ల ద్వారా సాగునీరు అందుతోంది. దీంతో నదిలో గ్రోయిన్ల ద్వారా కాలువలకు వచ్చే నీరే ప్రధానం కానుంది. వరి సాగుకు పూర్తిగా సహకరించకపోయినా, ఆరుతడి పంటలకు కూడా ఈ కాలువల నీరు చాలా కీలకంగా మారింది. నీటి పారుదల శాఖాధికారులు స్పందించి వర్షా కాలంలో గ్రోయిన్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువల ద్వారా నీరు ప్రవహించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చెరువులు నిండే పరిస్థితి లేదు



చినగుమ్ములూరు వద్ద వరాహ నదిలో గ్రోయిన్లు సక్రమంగా ఉంటే వర్షాలకు వచ్చే వరద నీటితో చెరువు లు నిండేవి. గ్రోయిన్లు పాడైపోవడంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పంటలు పండాలి అంటే వర్షం కురవాల్సిందే అన్నట్టుగా మారిపోయింది. అధికారులు గ్రోయిన్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలి.

– గాది వెంకటనాగభూషణం, రైతు.

నిధుల్లేక మరమ్మతులు చేపట్టలేదు..



వరాహ నదిలో గ్రోయిన్లు మరమ్మతులకు గురై చాలా ఏళ్లు అవుతోంది. ప్రతి ఏడాది గ్రోయిన్లు నిర్మాణం చేపట్టా లని కొత్త నివేదికలు పంపుతున్నాం. నిధులు విడుదల కాక మరమ్మతులు చేపట్టలేదు. సీజన్లలో రైతులే అడ్డుకట్టలు వేసుకుని సాగునీటిని తీసుకెళ్తున్నారు. ఈ ఏడాది ఆ పరిస్థితి కూడా లేదు.

– అమీనా భాను, ఇరిగేషన్ ఏఈ, ఎస్.రాయవరం మండలం

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నక్కపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన జరిగే ఈ సమావేశా నికి మండలంలో నెలకొన్న సమస్యలు సమావేశం దృష్టికి తీసుకొచ్చేందుకు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు రావాలని ఆయన కోరారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలను పరిష్కరించేందుకు గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలు, సమస్యలపై తీసుకున్న చర్యలను సమగ్ర నివేదిక రూపంలో తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావా లని ఎంపీడీవో ఆదేశించారు. ప్రతి సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావడం లేదని సభ్యుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులంతా ఈ సర్వసభ్య సమావేశానికి కచ్చితంగా హాజరు కావాలని, అత్యవసరమైతే ఎంపీపీ అనుమతి తీసుకోవాలన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా సోమరాజు

మునగపాక: మునగపాక మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా సోమరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంపీడీవో ఎం.ఉషారాణి తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో జరుగుతున్న నెల రోజుల శిక్షణకు వెళ్లడంతో ఈవోపీఆర్‌డీ సోమరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి సముచిత స్థానం


చిక్కాలను సత్కరిస్తున్న కోటవురట్ల యూత్ నాయకులు


చిక్కాల రామారావును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత

కోటవురట్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావును కోటవురట్లకు చెందిన ఆ పార్టీ యూత్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. యూత్ నాయకుడు శెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో స్థానిక యువకులు ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. చిక్కాల మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి యువత కీలకమని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని కోరారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపుతో పాటు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. యువకులు గౌతమ్, రాజేష్, వెంకటేష్, రాజు, సాయి, దుర్గాసాయి, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చిక్కాల రామారావును ఆ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత పెంటకోటలో ఆయన గృహంలో సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కోదార సుందరీలత, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ జనపరెడ్డి శేషారత్నం, ఆడపా శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సోమరాజు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.సోమరాజు కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. గ్రామ సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించాలంటూ నిరసన



ఎస్.రాయవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలో అధ్యాపకులు లేకుండా బోధన ఎలా సాగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ ప్రశ్నించారు. ఈ మేరకు కళాశాలలో అధ్యాపకులను నియమించాలంటూ విద్యార్థులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. కళాశాల తెరిచి రెండు నెలలు గడుస్తున్నా అధ్యాపకులను ఎందుకు నియమించలేదని బాలాజీ ప్రశ్నించారు. రాష్ట్ర హోంమంత్రి అనిత నివాసానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కళాశాలలో అధ్యాపకులు లేని విషయాన్ని గ్రహించకపోవడం దారుణమన్నారు. ఈ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 51 మంది, మొదటి సంవత్సరం విద్యార్థులు 20 మంది ఉన్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

తైక్వాండోలో యలమంచిలి విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన యలమంచిలి విద్యార్థులు

యలమంచిలి రూరల్: స్థానిక ధర్మవరం ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 5వ జిల్లా స్థాయి తైక్వాండో సబ్ జూనియర్, మినీ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో యలమంచిలి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ కేటగిరీల్లో మొత్తం 26 మంది పతకాలు సాధించగా.. వారిలో ముగ్గురు బంగారు, ఐదుగురు రజతం, 18 మంది కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. బంగారు పతకాలు సాధించిన వారిలో వి.మోక్షిత, ఎమ యానా గ్రేస్, కె.హిమబిందు ఉన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను స్థానిక తైక్వాండో కోచ్ నగిరెడ్డి రమేష్, పలువురు సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు అభినందించారు. తైక్వాండోలో మరింతగా సాధన చేసి భవిష్యత్తులో విజయాలు సాధించాలని వారు సూచించారు.

ఘనంగా వరసిద్ధి వినాయక కల్యాణం


సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతీ దేవాలయంలో సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి పంచలోహ ఉత్సవమూర్తుల ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం రాత్రి అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) జయలక్ష్మి దంపతులు కల్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, సహాయ కార్యదర్శి మళ్ల సూర్యప్రకాశరావు, ఆలయ ప్రధాన అర్చకుడు అంపోలు గోపాలకృష్ణశర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లకు నిరసనగా పాదయాత్ర



మునగపాకలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నేతలు



హరిపాలెంలో టీడీఆర్‌లు వద్దంటూ పాదయాత్ర చేస్తున్న సీఐటీయూ నాయకులు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు ఇస్తున్న టీడీఆర్ బాండ్లను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు మునగపాకకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం నేతలు కర్రి అప్పారావు, బ్రహ్మాజీ తదితరులు మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణ నిర్వాసితులకు పరిహారాన్ని నేరుగా నగదు రూపంలో ఇస్తామని హామీ ఇచ్చి నేడు టీడీఆర్ బాండ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. గతంలో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దొడ్డి దారిన కొంత మందికి టీడీఆర్ బాండ్లు ఇవ్వడం తగదన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నిర్వాసితులు పాల్గొన్నారు.

టీడీఆర్‌లు వద్దు.. పరిహారమే ఇవ్వాలి

అచ్యుతాపురం: అనకాపల్లి–అచ్యుతాపురం రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లు, భూములు కోల్పోతున్న వారికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని, టీడీఆర్‌లను అంగీకరించే ప్రసక్తే లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్‌రావు స్పష్టం చేశారు. టీడీఆర్‌లను వ్యతిరేకిస్తూ సోమవారం హరిపాలెం ఉన్నత పాఠశాల నుంచి అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహించారు. మార్గమధ్యలో పలువురు మహిళలు హారతి పట్టి పాదయాత్రకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ టీడీఆర్‌లతో నిర్వాసితులకు మేలు జరగదన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో జెడ్పీటీసీ నర్మాల కుమార్, నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము, కో కన్వీనర్ కె.రామ సదాశివరావు, ఎస్.బ్రహ్మాజీ, ఎస్.కన్నమునాయుడు, బుద్ధ రంగారావు, బొడ్డేడ రామ్ కుమార్, కూండ్రపు సోమునాయుడు, కె.బాబూరావు, దేవా, బొడ్డేడ సూర్య కృష్ణ, అప్పారావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఆస్పత్రిలో మెరుగైన సేవలకు కృషి

కోటవురట్ల: స్థానిక రాజాసాగి సూర్యకాంతమ్మ కమ్యూనిటీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సూపరింటెండెంట్ ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరగగా.. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై వివరణ ఇచ్చారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని, పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో ముగ్గురు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అయినా సాధ్యమైనంత వరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. స్థానిక నాయకులు ఆస్పత్రి అభివృద్ధిలో భాగస్తులు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ పుత్రేవు వెంకట సూర్యారావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు లింగన్ననాయుడు, వేచలపు జనార్దన్, జానకి శ్రీను పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక


పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఇదే

అనకాపల్లి: పద్మశాలి సంక్షేమ సంఘం అనకాపల్లి అధ్యక్షుడిగా డాక్టర్ గెడ్డం ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానందనగర్ సాయితేజ ఆస్పత్రి ఆవరణలో సోమవారం జరిగిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షునిగా అముజూరి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా తిప్పాన అప్పారావు, దొడ్డి సూరిబాబు, కన్వీనర్‌గా పంపాన సత్యనారాయణ, కార్యదర్శిగా సూరిశెట్టి రుషిబాబు, సహాయ కార్యదర్శులుగా కాకి శ్రీను, ఇమంది విజయ్‌కుమార్, కోశాధికారిగా ఆకుల వెంకటప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కాకి పైడిరాజు, జాయింట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆకుల రాజుబాబు ఎన్నికయ్యారు. పై కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాలు ఉంటుందని అధ్యక్షుడు గెడ్డం ప్రభాకర్ చెప్పారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం


స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి(అచ్యుతాపురం): ప్రధాని మోదీ మెప్పు కోసం, అదానీకి లాభాల కోసం స్మార్ట్ మీటర్లను ప్రజల నెత్తిన రుద్దటం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి జి.దేవుడుబాబు అన్నారు. రాంబిల్లి గ్రామంలో సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కర పత్రాలు పంపిణీ చేసి, ప్రచారం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు ప్రజలపై వేసి ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు లోకేశ్ నిర్వహించిన పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పేరుతో స్మార్ట్ మీటర్లను బిగించుకోవాలని సూచించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. గతంలో బాదుడే బాదుడు, దంచుడే దంచుడు అని ప్రజల్లోకి వచ్చిన కూటమి నాయకులు.. ఇప్పుడు చేస్తుంది ఏమిటని నిలదీశారు. ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మాణిక్యం, చందక మంగతాయారు, మరడదేవి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సుజల స్రవంతి నిర్వాసితుల నిరసన


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నల్లరేగుడుపాలెం గ్రామం రైతులు

అనకాపల్లి టౌన్: సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, బలవంతపు భూ సేకరణ చేయొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఆవరణలో సబ్బవరం మండలం నల్లరేగుడుపాలెం రెవెన్యూ గ్రామ రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వీరంతా 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములు కోల్పోవడం వల్ల రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఈ భూములకు బదులు వేరొక చోట భూములు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువకు నాలుగు రెట్లు నష్టపరిహారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో గంటా శ్రీరామ్, వి. నరేంద్ర కుమార్, పెతకంశెట్టి రమేష్, బుగుడి నూక అప్పారావు, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటితో జ్వరాలు ప్రబలే అవకాశం

కె.కోటపాడు : వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల్లో మురుగునీరు లేకుండా ప్రజలు జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. వి.సంతపాలెంలో సోమవారం జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ప్రజలతో కలిసి ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, గోలాల్లో రోజుల కొలది నీరు నిల్వ ఉండడం వల్ల నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, దోమకాటు ద్వారా డెంగ్యూ వ్యాధి ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ఎప్పటికప్పుడు ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ : సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు తెలిపారు. లింగంపేట గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్ వాట్సాప్‌లో అనేకరకాలుగా లింక్‌లు ఇచ్చి ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేయడం జరుగుతుందని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత చదువుపై శ్రద్ధ వహించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్ ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో లింగంపేట గ్రామస్తులు పాల్గొన్నారు.